క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలకలూరిపేట: పురుషోత్తమపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పురుషోత్తమపట్నంతో పాటు, కోటప్పకొండ రోడ్డులో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొండరాళ్లు తరలిస్తున్న వాహనాలు స్వాధీనం



యడ్లపాడు: ఎలాంటి అనుమతులు లేకుండా మెటల్ క్వారియింగ్ చేస్తూ.. కొండరాళ్లను తరలిస్తున్న వాహనాలను జిల్లా మైనింగ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని గృహలక్ష్మి, ప్రజ్ఞస్టోన్ క్రషర్ల నుంచి మైనింగ్‌శాఖ అనుమతులు లేకుండా వంకాయలపాడు పరిధిలోని ఓ కొండ వద్ద క్వారియింగ్ చేసి వాటిని క్రషర్‌కు తరలిస్తున్న వాటిని లారీలను పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ ఏడీ వి. నాగిని మంగళవారం తెలిపారు. క్వారీ యాజమాన్యంపై కేసులు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న లారీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు వెల్లడించారు.

విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి

నరసరావుపేట: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నమస్తే కార్యక్రమంలో పాల్గొనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సెప్టిక్ వర్కర్లు, సూపర్వైజర్లకు మంగళవారం పురపాలక సంఘ కార్యాలయం ప్రాంగణంలోని కౌన్సిల్ హాలులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి పూనే నుంచి ఇరువురు ట్రైనీలుగా విచ్చేయగా వారికి తెలుగు అనువాదకులుగా మచిలీపట్టణ వాసి చిన్ని కృష్ణ వ్యవహరించారు. పీఇఎంఎస్ఆర్ చట్టం 2013 నియమ నిబంధనలు తెలియజేసి దీనిలో పాల్గొనే వ్యక్తులు ఏ విధంగా వ్యవహరించవలెను, ఎటువంటి వస్తువులు ధరించాలో అవగాహన కల్పించారు. కలిగే దుష్ఫలితాలు, వాటి నివారణలు, జాగ్రత్తలు తెలియచేశారు.

రొంపిచర్ల సీనియర్ అసిస్టెంట్ మృతి




రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న పి. రవికుమార్ (51) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈపూరు మండలం ముప్పాళ్ళ గ్రామంలో గల తన స్వగృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎండీఓ కె.మ్యాథ్యూ బాబు ఆయన పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సీనియర్ అసిస్టెంట్‌గా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన మృతి తమకు తీరని లోటని పేర్కొన్నారు. అదే విధంగా మండలంలో అన్ని గ్రామాల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చరిత్ర వక్రీకరణ హేయమైనది

నాదెండ్ల: ప్రజల మధ్య మత వైషమ్యాలు పెరిగేలా చరిత్ర వక్రీకరించి హరిహర వీరమల్లు సినిమాలు తీయటం బాధాకరమని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజి చెప్పారు. తూబాడు గ్రామంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సినిమా లాంటి ప్రభావవంతమైన ప్రచార మాధ్యమం ప్రజల మధ్య ప్రేమ, సుహృద్భావం పెంపొందేలా, మంచి సందేశాలను ఇవ్వాలన్నారు. చరిత్రలో లేనటువంటి హరిహర వీరమల్లు లాంటి కల్పిత కథలతో ముస్లింలపై ద్వేషం పెంచేలా సినిమాలు తీయటం బాధ్యతారాహిత్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న వ్యక్తి మతవిద్వేషాలు రెచ్చగొట్టే సినిమాలు తీయటం దురదృష్టకరమన్నారు. స్వంత రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య సోదరభావాన్ని దెబ్బతీసే ఇలాంటి వ్యక్తులను ప్రజలు తగినరీతిలో బుద్ధిచెబుతారని పేర్కొన్నారు.

ఎల్ఐసీ డీఎం క్లబ్‌మెంబర్ కొల్లిపర మృతి



నాదెండ్ల: ఎల్ఐసీ చిలకలూరిపేట బ్రాంచి డీఎం క్లబ్ మెంబర్ కొల్లిపర పూర్ణచంద్రరావు (71) సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. గణపవరం గ్రామానికి చెందిన ఈయన గత 42 ఏళ్ళుగా చిలకలూరిపేట ఎల్ఐసీ బ్రాంచిలో ఏజెంట్‌గా పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం డీఎం క్లబ్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. గతంలో గ్రామంలో ఆర్ఎంపీగా సేవలందిస్తూ పంచాయతీ వార్డు సభ్యుడిగా, గణపవరం సొసైటీ సభ్యుడిగా పనిచేశారు. ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేశారు. ఆయన మృతి పట్ల బ్రాంచి మేనేజర్ జాన్‌విఠల్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కెల్లంపలి నివాళులు అర్పించారు.

మహాత్ముడు.. కనిపించడం లేదు!

- వినుకొండలో జాతిపిత విగ్రహం మాయం
- తొలగించిన మున్సిపల్ సిబ్బంది
- ఆక్రమణల తొలగింపులో భాగమంటూ దీర్ఘాలు
- ఆగ్రహిస్తున్న ఆర్యవైశ్య సోదరులు

మహాత్మా! ఎన్నెన్నె విషయాలు బోధ చేశావు. 'మనం మన కోసం చేసేది మనతోనే అంతరించిపోతుందన్నావు. ఇతరుల కోసం చేసేదే శాశ్వతంగా నిలిచి ఉంటుందని' చెప్పావు ఆనాడు. 'అహింస ఆయుధంగా, సత్యం–ధర్మం సైన్యంగా, చెడు చూడకు, వినకు, అనకు' అంటూ నినదించావు. 'మహావృక్షం కూడా మౌనంగానే ఎదుగుతుందనీ, అలాగే మహానుభావులుగా మిగలాలంటే మాటలకంటే చేతలకే ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలని చెప్పావు'. అలాంటి నీకు ప్రాముఖ్యత లేకుండా చేశారే వినుకొండలో. 'విశ్వాసం అనేది కొద్దిపాటి గాలికి వాలిపోయేది కాదు.. అది అచంచలమైనది.. హిమాలయమంత స్థిరమైనది' అని చెప్పిన నీ మాటలు, నీ త్యాగాలు ఇక్కడి యంత్రాంగానికి వంటబట్టినట్టు లేదు. అందుకే వినుకొండ నుంచి నీ విగ్రహాన్ని కనుమరుగు చేసేశారు.



గాంధీ విగ్రహం తొలగించిన ప్రాంతం ఇదే



మండల పరిషత్ కార్యాలయం వద్ద గతంలో ఉన్న గాంధీ విగ్రహం (ఫైల్)

వినుకొండ: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రధాన సెంటరులో ఏర్పాటు చేసిన విగ్రహం ట్రాఫిక్‌కు అడ్డంగా ఉందంటూ మున్సిపాలిటీ అధికారులు తొలగించడం వివాదాస్పదమైంది. ప్రస్తుతం ఇదే వినుకొండలో చర్చనీయాంశంగా మారింది. విగ్రహాన్ని మాత్రం అర్ధరాత్రి వేళ తొలగించారే కానీ, ఆ విగ్రహాన్ని ఎక్కడ ఉంచారు? తిరిగి ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయంపై మున్సిపల్ అధికారులు మాత్రం సమాధానం చెప్పడం లేదు. దీనిపై ఆర్యవైశ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విగ్రహం ఏర్పాటు చేసి సుమారు దశాబ్దం కాలం కావడం, ప్రతి సంవత్సరం గాంధీ జయంతి, వర్ధంతి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఇప్పుడు అడ్డంగా ఉందనే విషయం గుర్తుకు వచ్చిందా అంటూ ప్రశ్నిస్తున్నారు. గత ఆదివారం రాత్రి నూతన కమిటీ అమ్మవారి దేవాలయంలో నిర్వహించ వలసిన కార్యక్రమాలపై సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో కొందరు సంఘం సభ్యులు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉండవలసిన 'మహాత్మ గాంధీ' విగ్రహం తొలగింపు అంశాన్ని లేవనెత్తి దానిపై చర్చించారు. పురవీధుల్లో, ప్రధాన రహదారుల్లో ఎన్నో విగ్రహాలున్నా, ఎక్కడో ఒక మూలన ఉన్న గాంధీ విగ్రహాన్ని ఎవరు తొలగించారు? తొలగించిన విగ్రహం ఎక్కడ పెట్టారు? అని విషయమై పలువురు ప్రశ్నించారు. తొలగించిన విగ్రహం ఏర్పాటుపై అధికారులను ప్రశ్నించడంతోపాటు విగ్రహం ఏర్పాటుకు కృషి చేయాలని సభ్యులంతా తీర్మానించారు.



ఆర్యవైశ్యుల సమావేశంలో చర్చిస్తున్న సంఘం సభ్యులు

విగ్రహం ఏర్పాటు చేయాల్సిందే



పట్టణంలో మహాత్మాగాంధీ విగ్రహం ఒక్కటే ఉంది. ఇప్పుడు ఆయనను స్మరించుకునేందుకు కూడా వీలులేకుండా పోయింది. విగ్రహం తొలగింపు విషయమై కమిషనరును అడిగా. మున్సిపల్ సమావేశంలో కూడా ప్రశ్నించా. వారి నుంచి దాటవేత సమాధానం తప్ప సరైన జవాబు రావడం లేదు. ఇప్పటికైనా గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో గాంధీ విగ్రహం ఏర్పాటుకు ఉద్యమిస్తాం

–తెల్లాకుల రాజేష్‌ఖన్నా, మున్సిపల్ వైస్‌చైర్మన్

జిల్లా ఫ్లోర్ బాల్ జట్టుకు కే-రిడ్జి విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా ఫ్లోర్ బాల్ బాల బాలికల జట్లుకు కే-రిడ్జి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపల్ బర్నబాస్ మంగళవారం తెలిపారు. వినుకొండ లయోలా పాఠశాలలో ఈనెల 27వ తేదిన నిర్వహించిన జిల్లా జట్లు ఎంపిక పోటీల్లో తమ విద్యార్థులు అండర్–14 బాలికల జట్టుకు జుజ్జూరి ఉపగన చౌదరి, నాటకాల గురుహంసిని, సోమేపల్లి లీలలోహిత, మెడగం నిహారిక, బొల్లా యశస్వినీ, డి.రమ్య, ఎం.అమూల్య, అండర్–14 బాలుర జట్టుకు బి.వెంకటగౌతమ్, ఎం.భానుప్రసాద్, జె.ధరహాస్, ఏ.జయేష, ఎస్.సాయి, డి.కార్తికేయ, ఎం.నిఖిత్, ఎల్.మణికంఠ రెడ్డి, జి.ధనుష్, అండర్–19 బాలుర జట్టుకు జి.జస్వంత్, కె.రక్షణ్, సి.హెచ్. వెంకటసంజయ్, జె.చిన్మయి శ్రీనివాస్, జి.సుజిత్ తేజ, సి.హెచ్. విష్ణువర్ధన్, జె.రోహిత్, వి.చంద్రకిరణ్, బి.శ్రీకర్, ఎస్.శశాంక్ (గోల్ కీపర్), పి.కోటేశ్వరరావు ఎంపికై నట్టు వివరించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇంచార్జి కోట బాపూజీ , ఫిజికల్ డైరెక్టర్ ఎం.కిషోర్‌బాబు, పిఈటీలు శేషగిరి, మహిత అభినందించారు.

ఆరోగ్య సంరక్షణకు తోడ్పడాలి

నూజెండ్ల: సమాజంలో మహిళలు పారిశుధ్యం , పోషకాహారం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎంపిడివో పి.ఉమాదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ, డ్వాక్రా మహిళలకు పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం పై శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.

మొద్దు నిద్రవీడి... రోడ్లు బాగుచేయండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- గోతుల మయంగా మారిన రింగ్‌రోడ్డు పరిశీలన



రింగ్‌రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



గోతులమయంగా మారిన రింగ్ రోడ్డు

నరసరావుపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గోతులమయంగా మారిన జొన్నలగడ్డ – ఇస్సపాలెం రింగ్‌రోడ్డును మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది సంక్రాంతిలోగా రోడ్ల మరమ్మతుల పూర్తిచేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 14నెలలు గడిచినా ఇప్పటి వరకు అది కేవలం మాటలకే పరిమితమైందని తెలిపారు. అధ్వానంగా మారిన రింగ్‌రోడ్డు దీనికి నిదర్శనమని తెలిపారు. దాదాపు రెండున్నర కిలోమీటర్ల ఈ రోడ్డులో భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయని తెలిపారు. ఈ రోడ్డు గుంతలతో నిండిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే కరువైయ్యారని అన్నారు.

రోడ్డులో ప్రయాణించి ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, లారీలు, కారులు కూడా ప్రయాణించలేని పరిస్థితి ఉందని తెలిపారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి నాయకులు ఇప్పుడు వాటికి మంగళం పాడారని విమర్శించారు. రోడ్ల మరమ్మతులకు రూ.250 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు చెప్పారని, నేటికీ నియోజకవర్గంలోని అనేక రోడ్లు అధ్వాన్నంగానే ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వ సమయంలో జనసేన నాయకులు రింగ్‌రోడ్డు అధ్వాన్నంగా ఉందని వరి నాట్లు వేసి నిరసన తెలిపారని గుర్తుచేశారు. 14 నెలలుగా రోడ్డు అధ్వానంగా ఉందని, ఇప్పుడు జనసైనికులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 11 కిలోమీటర్లను రూ.14 కోట్లతో రింగ్‌రోడ్డు నిర్మాణాన్ని లింగంగుంట్ల నుంచి ఇస్సపాలెం బైపాస్ వరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వ 14 నెలల కాలంలో నియోజకవర్గంలో నూతనంగా ఒక్క రోడ్డు అయినా వేశారా అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడను ప్రశ్నించారు. కొత్తపాలెం నుంచి కోటప్పకొండ వరకు రోడ్డుకు డిసెంబర్ నెలలో అన్ని అనుమతులు ప్రభుత్వం ఇచ్చినా ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభించలేదన్నారు. ఈ రోడ్డుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ.4.5 కోట్లు మంజూరు చేశారని, ఎప్పుడు ఈ రోడ్డును పూర్తి చేస్తారో చెప్పాలని నిలదీశారు. కూటమి ప్రభుత్వం 14 నెలల్లో 1.75 లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. రాష్ట్రంలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని అప్పుగా తీసుకొచ్చిన రూ.1.75 లక్షల కోట్లు ఎటు వెళ్లాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి పాలనకు రోడ్లు పరిస్థితి అద్దం పడుతుందన్నారు. కూటమి నాయకులు ఇప్పటికైనా మొద్దు నిద్ర నుంచి మెల్కొని రోడ్లకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి గ్రామం వద్ద బ్రిడ్జి శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.20 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు.

సత్వరమే బ్రిడ్జి నిర్మాణాన్ని చేట్టాలని తెలిపారు. రోడ్లు అధ్వానంగా ఉన్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ పట్టించుకోవడం బాధాకరమని తెలిపారు. చీరాల నుంచి నకరికల్లు రోడ్డు నిర్మాణంలో భాగంగా నరసరావుపేట బైపాస్ నిర్మాణంలో భూసేకరణ ఇప్పటి వరకు పూర్తికాలేదన్నారు. అధికారులను నిద్రలేపి పనులు ప్రారంభించేలా ఎమ్మెల్యే డాక్టర్ చదవాడ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు కరీముల్లా, సర్పంచ్‌లు కుందా చిన్న, జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భవనం నర్సిరెడ్డి, ఎంపీటీ సీ మెట్టు రామిరెడ్డి, వెంకటప్పారెడ్డి, కోటయ్య, జల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోసగించటం చంద్రబాబుకు పరిపాటి

- మాజీ మంత్రి విడదల రజని
- వేర్వేరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం



మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజని

నాదెండ్ల: చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ప్రతిసారి ప్రజలను మోసగించటం పరిపాటిగా మారిందని మాజీ మంత్రి విడదల రజని చెప్పారు. గణపవరంలో మంగళవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లుగా పనిచేసిన వారికి కూడా రూ.10 వేలు జీతం ఇచ్చి పర్మినెంట్ చేస్తానని మోసపు హామీ నిచ్చిన చంద్రబాబునాయుడు, ఎన్నికల్లో గెలిచాక వలంటీర్లను తొలగించి వంచించారని విమర్శించారు. ఆడబిడ్డ పథకం క్రింద ప్రతిమహిళకు నెలకు రూ.1500 ఇస్తానని చెప్పి మహిళలను మోసగించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్, పార్టీ జిల్లా కార్యదర్శి వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు ఆదంవలి, తులం సుధాకర్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, మాజీ ఎంపీపీ వీరారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, కార్యదర్శి ఉడతా వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు మంగు ఏడుకొండలు, ఎస్సీ సెల్ యూత్ అధ్యక్షుడు చందు, నాయకులు దేవినేని శంకరరావు, గుత్తా యామలయ్య, అల్లడి రవికుమార్, కాట్రు రమేష్, ప్రభుదాసునాయుడు, కందుల శ్రీకాంత్, కాటా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: చంద్రబాబు మోసాలను ఎండగడదామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట మండలంలోని గోవిందపురం, మానుకొండవారిపాలెం గ్రామాల్లో సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎలా మోసపోయింది తెలుసుకుంటున్నారని చెప్పారు. అధైర్య పడకుండా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. రెండు గ్రామాల్లో పార్టీ నాయకులతో కలసి క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించి, ఇంటింటికి తిరిగి ప్రజల చేత క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయించారు. ఎంపీపీ, మండల అధ్యక్షుడు దేవినేని శంకరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు కుప్పాల ప్రభుదాస్ నాయుడు,గుత్తా యాములయ్య, అబ్బూరి సుబ్బారావు, మానుకొండవారిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ కల్లి వెంకటరెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ మానుకొండ మాధవీరెడ్డి, మానుకొండ శేషిరెడ్డి పాల్గొన్నారు.

పట్టణంలో...

13,30 వార్డుల్లో పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి అధ్యక్షతన బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ మీరాబి, డీలర్ సుభాని, జగన్నాధం, కరిముల్లా, రహమాన్, 30వ వార్డు ఇన్‌చార్జి షేక్ బడేమియా, అహమ్మద్ అలి, ఆసిఫ్. యాసిర్ అరాఫత్, సత్తార్ పాల్గొన్నారు.

సినారే సాహిత్యం సుస్థిరం



సినారే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని ఆర్‌వీఎస్ఎస్‌సీవీఎస్ హైస్కూల్‌లో జన విజ్ఞానవేదిక, లాలూ దాదా సాహెబ్ సేవాసమితి ఆధ్వర్యంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి కార్యక్రమం జరిగింది. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు తంగెళ్ళ సుధాకర హరిప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. నారాయణరెడ్డి రాసిన కావ్యాల గురించి ఆయన వివరించారు. సినారే రాసిన గజళ్ళు, ప్రపంచ పదులు పాడి వినిపించారు. బాల సాహితీవేత్త జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి 3 వేలకు పైగా సినిమా పాటలు రాశారన్నారు. బాలగేయాలు కూడా అనేకం రాశారన్నారు. ముందుగా అతిథులు సినారే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా పాఠశాల గ్రంథాలయానికి రూ.3 వేల విలువైన బాలసాహిత్య గ్రంథాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో లాలూ దాదా సాహెబ్ సేవాసమితి అధ్యక్షులు షేక్ సిద్దాంతి కరిముల్లా, చేవూరి కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో టీబీ పరీక్షలు



రొంపిచర్ల: మండలంలోని అన్ని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో టీబీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి. జగన్ నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో టీబీ నిక్షయ్ శిబిర్ నిర్వహిస్తున్నారని అన్నారు. ఎవరికైతే రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమట పట్టడం, ఛాతి నొప్పి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, అలసట వంటి లక్షణాలు ఉన్న వారు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో కళ్ళ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆయా వ్యాధి లక్షణాలు ఉన్న వారికి ఎక్స్‌రే తీయడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జనసేన వీడి వైఎస్సార్ సీపీలో చేరిక



గణపవరంలో జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో మాజీ మంత్రి రజిని

నాదెండ్ల: కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గానికి న్యాయం జరగలేదంటూ జనసేనకు చెందిన ఇరవై కుటుంబాల కార్యకర్తలు మంగళవారం మాజీ మంత్రి విడదల రజిని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గణపవరం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్తలు పసుపులేటి సాయి, కామిరెడ్డి గోపీనాథ్, ఆవుల ఫణీంద్ర, నరేంద్ర, షేక్ రషీద్, శివ, ఆవుల దేవ, శ్రీనివాసరావు, కరిముల్లా, షేక్ హబీబుల్లా, ముజీబ్, షేక్ జాన్‌సైదా, షేక్ అమీర్‌తో పాటూ మరికొంతమంది జనసేనను వీడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రజిని సాదరంగా వారిని ఆహ్వానించి కండువాలు కప్పారు.

కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వలేటి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, కౌన్సిలర్లు తులం సుధాకర్, షేక్ ఆదంవలి, పిల్లి సాగర్‌బాబు, నాలుగోవార్డు ఇన్‌చార్జి కాటా వెంకటేశ్వర్లు, మాజీ లిఫ్ట్ ఇరిగేషన్ ఛైర్మన్ బొప్పూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో కాంస్య పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు మంగళవారం తెలిపారు. కృష్ణా జిల్లా టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 25 నుంచి 27వతేదీ వరకు నిర్వహించిన 10వ జాతీయ ఓపెన్ జూనియర్ అండ్ సీనియర్ క్యోరుగి, పూంసే టైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలలో తమ విద్యార్థులు ఎం.సాయి శ్రీకర్ అండర్ 73 కేజీల విభాగంలో రెండు కాంస్య పతకాలు, వి.తులసీ తన్మయ్ ఓపెన్ కేటగిరి 46 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించినట్టు వివరించారు. విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, నర్సింగ్ ఇన్‌చార్జ్ ఏవీఎన్ గుప్తా, అధ్యాపకులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి:ఏపీఎస్ఆర్టీసీ సత్తెనపల్లి డిపోలో ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆన్ కాల్ డ్రైవర్లుగా పని చేసే వారికి చదవడం, రాయడం వచ్చి ఉండాలని, హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి 18 నెలలు గడిచి ఉండాలని, లైసెన్స్ ఫోర్స్‌లో ఉండాలన్నారు. సంస్థ నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేసిన యెడల వారికి ప్రతి దినం రూ.800 వేతనం ఇవ్వబడుతుందన్నారు. ఈ అర్హతలు గలవారు 2వ తేదీలోపు కార్యాలయంకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 9959225429, 7382897583 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నాదెండ్ల: కౌలురైతులు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం అందించే అనేక పథకాలు వర్తిస్తాయని వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కనపర్రు, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసే పంట వివరాలను ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. పత్తి సాగు చేసే రైతులు ఈ నెలాఖరులోగా బీమా క్రింద ఎకరాకు రూ.1900లు ప్రీమియం చెల్లిస్తే విపత్కర పరిస్థితుల్లో పంట నష్టపరిహారం దక్కుతుందన్నారు. మిరప, కంది, వరి సాగుదారులు ఆగస్టు 15లోగా నమోదు చేయించుకోవాలన్నారు.

పెదకంచర్లలో రైతులకు శిక్షణ కార్యక్రమం



వినుకొండ: మండలంలోని పెదకంచర్ల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం అధికారి ఎం. శివకుమారి మాట్లాడుతూ వరి యాజమాన్యం, విత్తన రకాలు, విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం, జీవన ఎరువుల వాడకం, చీడపీడల నివారణ గురించి సమగ్రంగా అవగాహన కల్పించారు. అనంతరం ఏవో వరలక్ష్మి మాట్లాడుతూ వరి పంటకు ఆగస్టు 15 లోపు పంటల బీమాకు ఇన్సూరెన్స్ ప్రీమియంను ఎకరాకు రూ.80 కామన్ సర్వీస్ సెంటర్‌లో చెల్లించాలన్నారు. క్రాప్సేన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకంతో ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడం ద్వారా రైతుల పంటకు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గినప్పుడు పంటలకు బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో అరుణ, వినుకొండ ఏఈవో ఆరిఫ్, వీఏఏ యశ్వంత్, సిబ్బంది పాల్గొన్నారు.